క్లుప్తంగా

డిమాండ్లను పరిష్కరించాలి



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో బెటాలియన్ కానిస్టేబళ్ల డిమాండ్లను ప్రభుత్వం సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సోమవారం సిరిసిల్లలోని కార్మికభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పక్క రాష్ట్రాల్లో అమలుచేస్తున్న విధంగా బెటాలియన్ కానిస్టేబళ్లకు ఒకే పోలీస్ విధానాన్ని అమలుచేయాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోతో పోలీసులపై పనిభారం, మానసిక ఒత్తిడి పెరుగుతుందన్నారు. పోలీసులకు అందించాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను వెంటనే అమలు చేయాలని, సస్పెండ్ చేసిన కానిస్టేబుళ్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. నాయకులు పంతం రవి, సోమ నాగరాజు, బాచుపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లు పంపిణీ


పంపిణీ చేస్తున్న ఆడెపు మురళి- శారద

సిరిసిల్ల: ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని నిజం చేస్తూ తమ వద్ద పనిచేసే సిబ్బంది, ఆత్మీయులకు 24 సైకిళ్లను ఉచితంగా అందించారు సిరిసిల్లకు చెందిన ఆడెపు మురళి, శారద దంపతులు. సిరిసిల్ల గాంధీనగర్‌లో వ్యాపారం నిర్వహిస్తూ నిధి బ్యాంకును ఏర్పాటు చేశారు. నిత్యం ఉదయం సైకిల్‌పై వ్యాయామం చేసే మురళి తమ వద్ద పనిచేసే సిబ్బందికి, ఆత్మీయులకు అందించాలని భావించారు. 24 సైకిళ్లను ఆర్డర్‌పై తెప్పించి సోమవారం వారికి అందించారు. ఈ సందర్భంగా ఆడెపు మురళి, శారద దంపతులను పలువురు అభినందించారు.

సీనియర్ సిటిజన్ల సంక్షేమమే లక్ష్యం



సిరిసిల్లకల్చరల్: సీనియర్ సిటిజన్ల సంక్షేమమే లక్ష్యంగా 'పిలుపు' పత్రిక పని చేస్తోందని జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం అన్నారు. ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెలువడిన పిలుపు పత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబర్ 11 వయోధికులకు క్రీడల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ఏనుగుల ఎల్లయ్య, శ్రీగాద మైసయ్య, డాక్టర్ జనపాల శంకరయ్య, దొంత దేవదాస్, మిట్టపల్లి రాములు, గజ్జెల్లి రాంచంద్రం, గౌరిశెట్టి ఆనందం, ఇరుకుల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి


వినతిపత్రం ఇస్తున్న తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు

బోయినపల్లి: పెండింగ్‌లో ఉన్న డీఏలపై ప్రభుత్వం మళ్లీ సమీక్షించాలని టీపీయూస్ జిల్లా అధ్యక్షుడు గణికంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కేవలం ఒక డీఏ ప్రకటనతో ఉపాధ్యాయులకు నిరాశే మిగిలిందన్నారు. ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కాలె నారాయణరెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగులకు వారి ఖాతాల నుంచి రావాల్సిన జీపీఎఫ్, మెడికల్, సరెండర్ బిల్లులు, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్లు, గ్రాట్యుటీలు పేరుకుపోయి ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలుచేయకుంటే నవంబర్ 23న హైదరాబాద్‌లో ధర్మాగ్రహ దీక్ష చేపడుతామన్నారు.జిల్లా నాయకులు వెంకటరావు, కే. నరేశ్, మండల బాధ్యులు తిరుపతి, కనుకయ్య గురుదేవ్, చంద్రమౌళి తదితరులున్నారు.

ఇల్లంతకుంట: మండల టీపీయూఎస్ సంఘం ఉపాధ్యాయులు తహసీల్దార్‌కు ఎంఏ ఫారూఖ్ వినతిపత్రం అందజేశారు. ఈనెల 22న పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన, 28న తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత, నవంబర్ 5న జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల వద్ద ధర్నా, నవంబర్ 23న చలో ఇందిరాపార్క్ కార్యక్రమం పెట్టనున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇక్కడ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి ఎర్రోజు బ్రహ్మచారి, ఉపాధ్యాయులు కటకం శ్రీనివాస్, రమణ, సుభాష్ రెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న కష్టాలు

- మండలంలో రోడ్ల నిర్మాణానికి రూ. 5.75 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తంచేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు



కల్వర్టుపై గుంతలమయంగా రామన్నపేట రహదారి

కోనరావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలు పరిష్కారం కానున్నాయి. రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరు

కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల కోసం పంచాయతీ రాజ్ నుంచి రూ. 5.75 కోట్లు మంజూరయ్యాయి. కొలనూర్ నుంచి రామన్నపేట రహదారికి, వంతెనకు రూ.1.90 కోట్లు, సుద్దాల నుంచి మంగళ్లపల్లి మధ్య ఉన్న రోడ్డుకు రూ.1.30 కోట్లు, మల్కపేటలో చల్మెడ ఆనందరావు నిర్మించిన రామాలయం నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు సీసీరోడ్డుగా మార్చేందుకు రూ.90 లక్షలు, పల్లిమక్తలో సీసీరోడ్ల నిర్మాణానికి రూ. కోటి 65 లక్షలు మంజూరయ్యాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది సుద్దాల నుంచి మంగళ్లపల్లి వెళ్లే రహదారి. గత 60 ఏళ్లుగా ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చాలని గ్రామస్తులు గత ప్రభుత్వ హయాంలో పలుసార్లు అప్పటి ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు విన్నవించినా నిధులు మంజూరుకాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విన్నవించగా రూ.కోటి 30 లక్షలు మంజూరు చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఎవరూ పట్టించుకోలే..



కోనరావుపేట మండలంలో మంగళ్లపల్లి చివరి గ్రామం. సుద్దాల క్రాసింగ్ నుంచి సుమారు 2 కిలోమీటర్లు ఉన్న రోడ్డును తారురోడ్డుగా మార్చాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నాం. మా సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాకు నిధులు మంజూరు చేయించి ఇబ్బందులు తొలగించారు.

– బాదవేని బాలరాజు, మంగళ్లపల్లి

ఏడాదిలోపే నిధులు



గ్రామంలోని పలు ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేగా ఎన్నికైన కొన్ని రోజుల్లోనే గ్రామస్తులమంతా కోరాం. మా సమస్యలపై ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టిసారించి రోడ్ల నిర్మాణం కోసం రూ.కోటి 65లక్షలు మంజూరు చేయించారు. ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– నాయిని ప్రభాకర్ రెడ్డి, పల్లిమక్త

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

బోయినపల్లి: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలన తదితర అంశాలపై మండలంలోని వెంకట్రావుపల్లిలో సోమవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ యువకులు మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్, మాజీ సర్పంచ్ బూర్గుల నందయ్య, యువకులు ఇరువాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రా పద్ధతిలో టపాసుల దుకాణాలు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలో టపాసుల దుకాణాల లైసెన్స్ కోసం ఆర్డీవో కార్యాలయంలో దరకాస్తు చేసుకున్న వ్యాపారులకు సోమవారం ఆర్డీవో రాజేశ్వర్ డ్రా పద్ధతిన దుకాణాల నంబర్లు కేటాయించారు. 31 మంది వ్యాపారులకు నంబర్లను కేటాయించారు. వేములవాడ తహసీల్దార్ మహేశ్ కుమార్ ఉన్నారు.

మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ విజయ

గంభీరావుపేట: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ అన్నారు. మండలంలోని గంభీరావుపేట, జగదాంబతండా, దేశాయిపేట గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, సింగిల్‌విండో సీఈవో రాజిరెడ్డి, డైరెక్టర్లు మల్యాల రాజవీర్, అంజిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వైద్యశిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని «మా» అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు లింగన్నపేట పీహెచ్‌సీ వైద్యులు సోమవారం నేత్ర, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. 25 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించి ఆరుగురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో నలుగురిని ఆపరేషన్ కోసం సిఫారసు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు మల్లుగారి నర్సాగౌడ్, నేత్ర వైద్య నిపుణులు ప్రకాశ్, దంత వైద్యాధికారి సర, పీహెచ్‌సీ వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, అఖిల్, సీహెచ్‌వో రమేశ్, ఏఎన్‌ఎం విజయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు కోసం ఫ్లెక్సీలు



ముస్తాబాద్ : ప్రభుత్వం మండలానికి డిగ్రీ కళాశాల మంజూరు చేస్తుందనే నమ్మకం ఉందంటూ డిగ్రీ కళాశాల సాధన కమిటీ కన్వీనర్ చింతోజు బాలయ్య ఫ్లెక్సీలు ఏర్పాటుచేశాడు. గతేడాదిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ బాలయ్య వివిధ రూపాల్లో ఉద్యమాలు చేస్తున్నాడు. ధర్నాలు, రాస్తారోకోలతోపాటు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టాడు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. ఈనేపథ్యంలో ప్రజాప్రభుత్వంపై నమ్మకం ఉందంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. గత ప్రభుత్వం వాగ్దానాలు ఇచ్చిందని, ఈ ప్రభుత్వం ఆచరణ చూపిస్తుందని పలు కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు.

ఎస్జీటీని సర్దుబాటు చేస్తాం

సాక్షి స్పందన

గంభీరావుపేట: త్వరలో జరగనున్న సర్దుబాటు ప్రక్రియలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సెకండరీ గ్రేడ్ టీచర్‌ను నర్మాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు సర్దుబాటు చేస్తామని డీఈవో రమేశ్‌కుమార్ తెలిపారు. పేరుకే «ఉన్నత»ం.. అనే శీర్షికన సోమవారం సాక్షిలో కథనం ప్రచురితంకాగా దీనికి డీఈవో స్పందించారు. ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు 51 మంది, ఆరో తరగతి నుంచి 8వ తరగతి వరకు ఎనిమిది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమిక స్థాయిలో ఒక ఎస్జీటీ టీచర్, ప్రాథమికోన్నత స్థాయిలో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్‌లు ఉన్నారని డీఈవో తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి


వల్లంపట్లలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

ఇల్లంతకుంట: మండలంలో ఓబులాపూర్, వల్లంపట్ల గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ..మండలంలో సభ్యత్వ నమోదును చేయించాలని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండలంలో కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, లేకపోతే రైతులతో కలిసి ధర్నా చేస్తామన్నారు. జిల్లా పరిశీలకులు ఏలేటి చంద్రారెడ్డి, మండల బీజేపీ కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, బత్తిని స్వామి, ముత్తక్క, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముస్తాబాద్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రానికి చెందిన చెరుకు చంద్రం (37) ముస్తాబాద్ నుంచి నామాపూర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రంకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు, అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

● విద్యార్థులకు అవగాహన

ఇల్లంతకుంట : సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై మండలంలోని జంగారెడ్డి పల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షీటీం బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు రమ్య అశ్విని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వృద్ధాశ్రమంలో చీరెలు పంపిణీ

వేములవాడఅర్బన్: మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు సభ్యుల బృందం ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ భవిత వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అనంతరం వారికి చీరెలు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేశ్, తదితరులున్నారు.

● తంగళ్లపల్లి ప్రత్యేకాధికారి బదిలీ

తంగళ్లపల్లి: మండల స్పెషల్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సిరిసిల్ల ఆర్డీవో లోలావర్ రమేశ్ సోమవారం బదిలీ అయినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆయన స్థానంలో కొత్తగా వచ్చే సిరిసిల్ల ఆర్డీవో కే.వెంకట ఉపేందర్ రెడ్డి త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.


● నివాళి

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో చర్చి ఫాస్టర్ బాడిగ సోమయ్య మృతిచెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. సోమయ్య మృతదేహం వద్ద నివాళి అర్పించారు. ఆయనవెంట డీసీసీ కార్యదర్శి చేపూరి గంగాధర్, నాయకులు మానుక సత్యం, పెంతల శ్రీనివాస్ తదితరులున్నారు.

● ధర్మాన్ని అనుసరించాలి

గంభీరావుపేట: ధర్మాన్ని మనం అనుసరించాలని, ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుందని సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని సత్సంగ సదనంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. భూపతి, రాంరెడ్డి, రాములు, బాల్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, పద్మ, నారాయణ, అనంతరెడ్డి, అంజమ్మ సత్సంగ నామాలను వివరించారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో సోమవారం సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	01	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	01	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	01	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	02	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	01	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	02	560
నందీశ్వర సూట్స్	02	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	02	448
పార్వతీపురం స్పెషల్	01	672
పార్వతీపురం సాధారణ	02	336

- వేములవాడ



ముస్తాబాద్ మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో ఇళ్ల మధ్య మధ్య మురుగునీరు కంపు కొడుతోంది. ఇళ్ల మధ్య కొంతదూరం వరకు డ్రైనేజీ నిర్మించిన అధికారులు మరో వందగజాల వరకు డ్రైనేజీ నిర్మించలేదు. దీంతో మురుగు నీరు నిలిచి రోగాలబారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. వెంటనే డ్రైనేజీ నిర్మించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: రమేశ్, పంచాయతీ కార్యదర్శి, సెల్‌నెంబర్ : 9866964956

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కస్తూర్బా గాంధీ పాఠశాల తనిఖీ


పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో శుద్ధజల కేంద్రంలో ఇబ్బంది ఉందని తెలపగా పరిశీలించి నూతన ప్లాంట్ ఏర్పాటు చేస్తానని విప్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని బాధ్యులకు సూచించారు. పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ఏపీఎం రాకేశ్, మాజీ సర్పంచ్ అబ్దుల్ రషీద్, నాయకులు తిరుపతి, రవీందర్, గణేశ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం కొలనూరు గ్రామంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామస్తులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి కొలనూరు ప్రాజెక్టు సందర్శించారు. రైతులు ప్రాజెక్టుకు మత్తడి నిర్మాణం లేదని తెలపగా మత్తడి నిర్మాణం చేపట్టాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రుణమాఫీలో భాగంగా సుమారు రూ.18వేల కోట్లను రైతుల ఖాతాల్లోకి జమచేశామన్నారు. పల్లిమక్తలో రూ. కోటి 65 లక్షలతో, కొలనూరు నుంచి రామన్నపేట రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రూ. కోటి 90 లక్షలు, సుద్దాల క్రాస్ రోడ్ నుంచి మంగళపల్లికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. కోటి 30 లక్షలు, మల్కపేటలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి రామాలయానికి సీసీరోడ్డు నిర్మాణానికి రూ. 90 లక్షల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తికి రెండేళ్ల జైలు

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని నెహ్రూనగర్ అంబాభవాని ఆలయంలో హుండీ చోరీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. టౌన్ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... 2017 ఫిబ్రవరి 27న పూజారి భవాని ఆలయానికి తాళంవేసి వెళ్లాడు. మరుసటి గుడి తాళం పగులగొట్టి ఉండటం, గుడి సమీపంలోని మానేరు వాగులో హుండీ ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని భావించి ఆలయ కమిటీ అధ్యక్షుడు చిలుక నారాయణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు వడ్డెపెల్లి సత్యం అలియాస్ ఎరుకల సత్యంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం ఏడుగురిని విచారించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుముల సందీప్ కేసు వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరికి..

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక గ్రామ ఎల్లమ్మ ఆలయంలో చోరీకి పాల్పడ్డ ఇద్దరిని 17 నెలల జైలుశిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో సంఘ ప్రణయ్, షేక్ సోహెల్ చోరీకి పాల్పడ్డారు. చోరీపై కొదురుపాకకు చెందిన నాగుల నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు. అనంతరం విచారణ అధికారి మహేందర్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు పీసీ రాజేంద్రప్రసాద్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున విక్రాంత్ కేసు వాదించారు. పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి జ్యోతిర్మయి సంఘ ప్రణయ్, షేక సొహైల్‌కు 17 నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.


వేములవాడఅర్బన్: రుద్రవరం ఎల్లమ్మ ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరికి 18 నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు వెల్లడించారు. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ మండలం రుద్రవరంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సంఘ ప్రణయ్, షేక్ సోహెల్ చోరీకి పాల్పడగా అప్పటి సర్పంచ్ రాంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ మేరకు రిమాండ్‌కు తరలించనట్లు తెలిపారు.

ఓబులాపూర్ పాఠశాలలో పాము కలకలం


పాఠశాల ఆవరణలో పింజెర

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పింజర పాము ప్రవేశించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పాఠశాల ఆవరణలోని వేపచెట్టు వద్ద పింజర పాము ఉన్నట్లు విద్యార్థులు గుర్తించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి చంపేశారు. ఈ విషయంపై హెచ్‌ఎం ఉపేందర్‌ను వివరణ కోరగా పాము శనివారం వచ్చిందని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



గంభీరావుపేట: కులగణనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి వచ్చేనెల 6 నుంచి ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటా నికి క్షీరాభిషేకం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్‌గౌస్, నాయకులు బాల్‌రెడ్డి, రవి యాదవ్, చెన్నిబాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

ఇల్లంతకుంట: మండల పశువైద్యాధికారిగా పూర్ణ చంద్రిక సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇల్లంతకుంట పశువైద్య కేంద్ర ఇన్‌చార్జిగా ఇప్పటి వరకు సతీశ్ ఉన్నారు. నాలుగేళ్లుగా పశు వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండగా పూర్ణ చంద్రిక బాధ్యతలు స్వీకరించారు.